క్లుప్తంగా

వార్షిక ప్రణాళిక తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రవి

సత్యవేడు: రానున్న విద్యా సంవత్సరానికి వార్షిక ప్రణాళికను ప్రధానోపాధ్యాయులు తప్పని సరిగా తయారు చేయాలని ఎంఈఓ కె. రవి సూచించారు. బుధవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలు వద్ద వార్షిక ప్రణాళిక తయారీపై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ సమావేశం జరిగింది. ఎంఈఓ రవి,సీఆర్‌సీ హెచ్‌ఎం హెచ్ భారతి మాట్లాడుతూ ప్రణాళిక ఆధారంగా రానున్న విద్యా సంవత్సరానికి నిధులు మంజూరు అవుతాయని తెలిపారు. ఈ వివరాలను డైస్ 2022 ఆధారంగా నమోదు చేయాలని చెప్పారు. ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ టూ ఉషా, 74 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్స్ నిరసన



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్స్ బుధవారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ సచివాలయాల వ్యవస్థలో ఎనర్జీ అసిస్టెంట్స్‌గా నియమాకమై, ట్రాన్స్ కో సిబ్బంది ఆధ్వర్యంలో పనిచేయడం ఇబ్బందిగా ఉందని తెలిపారు. పనిభారం ఎక్కువగా ఉంటోందన్నారు. సచివాలయాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నోటు పుస్తకాల పంపిణీ



తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రజా ప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు వితరణగా అందజేశారు. స్థానిక అడ్వకేట్ ఉదయ్‌కుమార్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ప్రజా ప్రగతి ట్రస్టు మండల కోఆర్డినేటర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయురాలు లీలావతి, వలంటీర్ మాధవి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో ఏఐటీయూసీ మహాసభలు



మాట్లాడుతున్న రాధాకృష్ణ

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తిలో డిసెంబర్ 17, 18, 19 తేదీల్లో మూడు రోజుల పాటు జరుగనున్న ఏఐటీయూసీ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలను కార్మికులంతా కలిసి జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం బైరాగిపట్టెడలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-చలానాల రద్దు, రవాణా రంగంలో నూతన చట్టాల రద్దు, ఆటో రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు సాధనకై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల జిల్లా ప్రథమ మహాసభల్లో రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డీ.రవి, ఆటో యూనియన జిల్లా ప్రధాన కార్యదర్శి శివ, కేవై.రాజా, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

27న కార్తీక కోటి దీపోత్సవం

తిరుపతి కల్చరల్: టీటీడీ ధర్మప్రచార పరిషత్ సహకారంతో తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీన రామచంద్ర పుష్కరిణి వేదిక వద్ద కార్తీక కోటి దీప మహోత్సవం చేపడుతున్నట్లు ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహోత్సవంలో భాగంగా ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పుష్పాలంకరణ సేవ, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు కార్తీక దీప సేవ కార్యక్రమం, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు లలిత సహస్రనామం, రుద్రాభిషేకం ఉంటుందన్నారు. అనంతరం 6 నుంచి 9 గంటల వరకు భక్తులతో కార్తీక దీప మహోత్సవం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే భక్తులు సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని కోరారు. పాస్‌లు ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు ఇస్తామని తెలిపారు. వివరాలకు 9848837331,9440078978, 9440271154 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం



సత్యవేడు: మదనంబేడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: రాష్ట్రంలో అన్ని వర్గాలకూ మేలు చేకూరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం మదనంబేడు సచివాలయ పరిధిలో 'ఏపీకి మళ్లీ జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని సర్పంచ్ ఎస్. శివరంజని అధ్యక్షతన నిర్వహించారు. మండల నాయకులతో కలసి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాల వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు, అన్ని వర్గాల అభ్యున్నతికి పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నదేనని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే పాలనను తీసుకొచ్చారని పేర్కొన్నారు. నాయకులు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వారికి అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, జగనన్న పాలనకు, గత ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించాలని సూచించారు. పంచాయతీ పరిధిలో వివిధ పథకాల ద్వారా రూ.21.77 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మళ్లీ మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సునీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, వైస్ ఎంపీపీ డి.సరోజని, నాయకులు రాబర్టు, ఎస్.వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, గోవిందస్వామి, శరవణన్, రమణ, శ్రీనివాసులు రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, మునివేలు, వంశీరెడ్డి, సుబ్రమణ్యం, శ్రీధర్‌రెడ్డి, పూలపళణి, రాబర్టు, ఎంపీడీఓ చంద్రశేఖర్, సచివాలయ కార్యదర్శి యు.మాధవి పాల్గొన్నారు.

జగదానందకారకా..



తెప్పపై విహరిస్తున్న సీత, లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి

- వైభవంగా తెప్పోత్సవాలు ప్రారంభం
- తొలిరోజు శ్రీరామచంద్రుడిగా అభయం

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధంలోని శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఐదురోజుల కార్తీక తెప్పోత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శ్రీసీతాలక్ష్మణ సమేత రామచంద్రమూర్తి తెప్పపై జలవిహారం చేస్తూ భక్తులను అనుగ్రహించారు. వేకువజామున సుప్రభాత సేవతో నిత్యపూజా కైంకర్యాలను పూర్తి చేశారు. ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాల అనంతరం శ్రీసీతా, లక్ష్మణ సమేత రామచంద్రమూర్తి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఊరేగింపుగా పద్మసరస్సు వద్దకు వేంచేపు చేశారు. ఊరేగింపులో అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. పద్మసరస్సు వద్దకు చేరుకున్న ఉత్సవమూర్తులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై అధిష్టింపజేశారు. తదుపరి భక్తుల గోవిందనామస్మరణలు, వేద, గాత్ర, నాద కచ్చేరీల నడుమ స్వామివారు తెప్పపై మూడు ప్రదక్షిణలు జల విహారం చేసి భక్తులను కటాక్షించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవమూర్తులకు ఆస్థానం, అనంతరం ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి, ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. రెండో రోజు గురువారం ఆండాళ్ అమ్మవారు తెప్పపై విహరిస్తూ భక్తులను అనుగ్రహిస్తారని ప్రధాన అర్చకుడు శ్రీధరభట్టాచార్య తెలిపారు.

నాణ్యతగా జగనన్న గోరుముద్ద



విద్యార్థులతో కలసి భోజనాన్ని తింటున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద కింద మధ్యాహ్న పథకంలో నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు పెట్టాలని మండల విద్యాశాఖాధికారి-2 మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని నెలవాయి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. తొలుత పాఠశాల ప్రార్థనలో పాల్గొని పలు సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో మెనూ ప్రకారం రుచికరమైన భోజనాన్ని అందించాలని, ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగాలని ఉపాధ్యాయులకు సూచించారు.

కులగణనను పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామచంద్ర

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : మండలంలో కులగణనను పారదర్శకంగా నిర్వహించాలని కేవీబీ పురం ఎంపీడీవో రామచంద్ర అన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని సీడీపీవో కార్యాలయం సమావేశ హాలులో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి కులగణనపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో కులగణన చేపట్టాల్సిన విధానం, జాగ్రత్తలను వివరించారు. నిర్ణీత సమయంలో కచ్చితత్వంతో పూర్తి చేయాలని కోరారు. తొట్టంబేడు ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో భారతి, ఈవోపీఆర్డీ తరుణాక్షరెడ్డి పాల్గొన్నారు.

కండలేరులో 11.142 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో బుదవారం నాటికి 11.142 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగకు 40 క్యూసెక్కులు, పిన్నేరు వాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లో లెవల్ స్లూయిజ్‌కు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బధిర విద్యార్థిపై దాడి అమానుషం



సమావేశంలో పాల్గొన్న రజక కులవృత్తుల సమాఖ్య నాయకులు

శ్రీకాళహస్తి: రజక విద్యార్థిపై దాడి అమానుషమని ఆంధ్రప్రదేశ్ రజక కులవృత్తుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు సంజాకుల మురళీకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని భరద్వాజ తీర్థంలో సమాఖ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని టీటీడీ బధిర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వడమాలపేట రజక కాలనీకి చెందిన దాము కుమారుడు చందుపై సహచర విద్యార్థులు నిప్పంటించిన ఘటన దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై రసాయినిక ద్రావణం పోసి నిప్పు పెట్టినట్లు చందు స్వయంగా రాసి చూపించాడని, దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితుడి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్దెత్తున నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య జయశ్యామ్, రమేష్, బాబు, మురళి, డూండీ, సురేష్, బాబు, లోకేష్, ముని కుమార్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



వరదయ్యపాళెం: మండలంలోని బలిజపాళెం, వరదయ్యపాళెం దళితవాడ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు బుధవారం విద్యాసామగ్రిని దాతలు వితరణగా అందజేశారు. ఎంఈఓ సరస్వతి ఈ సందర్భంగా మాట్లాడుతూ బలిజపాళెంకు చెందిన పి.వెంకటేశ్వర్లు తనయులు శంకరయ్య, నరేష్, గోపి తండ్రి జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు, జామెంటరీ బాక్సులు, ఇతర విద్యా సామగ్రిని అందజేశారన్నారు. హెచ్‌ఎం రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది ఇష్టారాజ్యం



మునగలపాళెం: అరుంధతీవాడ కేంద్రంలో పిల్లలతో వృద్ధురాలు

ఏర్పేడు: ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో మండలంలో అంగన్‌వాడీ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు కేంద్రాలకు విద్యార్థులు తక్కువ శాతం హాజరవుతున్నా పట్టించుకోవడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బుధవారం మునగలపాళెం అరుంధతీవాడలో అంగన్‌వాడీ కార్యకర్త విధులకు హాజరుకాలేదు. ఆయా స్థానంలో ఓ వృద్ధురాలు మధ్యాహ్నం భోజనం పిల్లలకు అందించింది. ఈ కేంద్రంలో సుమారు 20 మంది పిల్లలు ఉండగా, ఆరుగురు మాత్రమే హాజరయ్యారు. ఈ విషయమై రేణిగుంట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కృష్ణమంజరిని వివరణ కోరగా, అరుంధతీవాడ అంగన్‌వాడీ కార్యకర్త గౌరి బుధవారం ఆస్పత్రికి వెళ్లి, ఆలస్యంగా కేంద్రానికి వెళ్లినట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీలు చేసి, సమయపాలను పాటించని సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే రావాలి







నారాయణవనం: జెండా ఆవిష్కరణలో ఎమ్మెల్యే ఆదిమూలం, నాయకులు, వరదయ్యపాళెం : జెండా ఆవిష్కరణలో ప్రజాప్రతినిధులు, నాయకులు, బీఎన్‌కండ్రిగ: కరపత్రాల విడుదల

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగి జనం సుఖసంతోషాలతో ఉండాలంటే జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం కలవగుంటలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. పథకాల లబ్ధిని వివరించే బోర్డును ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం అందించని విధంగా నాలుగన్నరేళ్లలో ప్రజలకు వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. సచివాలయ కన్వీనర్ మావిళ్లపల్లి వెంకటేష్, నాయకులు వయ్యాల మనోహర్‌రెడ్డి, సురేంద్ర యాదవ్, నాగభూషణ్, రాజా, వెంకటరత్నం, డీపీ రమణ, పెంచలయ్య, మల్లి, నాగయ్య, శివరామరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

బుచ్చినాయుడుకండ్రిగ: సంక్షేమం,అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వెస్టు వరత్తూరు సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. అయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 99.5 శాతం మేనిఫెస్టో అమలు చేసి చరిత్ర సృష్టించారని తెలిపారు. కుక్కంబాకం గ్రామ సచివాలయాల పరిధిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధికి కలిపి రూ. 26 కోట్ల 96 లక్షలు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి తిరుమెర్ల రవిరెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, నాయకులు జయచంద్రారెడ్డి, కోటేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, ఏఓ త్రివిక్రమ్‌రావు, డీటీ చంద్రబాబునాయుడు, గ్రామ కార్యదర్శి శివకుమార్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రూ.లక్షల్లో లబ్ధి

ఏర్పేడు: మండలంలోని మర్రిమందలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలు తెలిపే బోర్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం రూ.లబ్ధి పొందినట్లు వివరించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై చేకూరిన లబ్ధిని వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం రాత్రి పల్లె నిద్ర చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రమణయ్యయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీటీసీ సభ్యులు నాగరాజురెడ్డి, మునిరాజా, ఉప సర్పంచ్ మణి, కో-ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, నాయకులు కృష్ణారెడ్డి, గెరటయ్య, గురునాథం, రామయ్య ఆచారి, రజని, ఏకాంబరరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా పథకాలు

వరదయ్యపాళెం: దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని మరదవాడ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. తొలుత సచివాలయ పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రజలకు అందిన రూ. 19.66 కోట్ల లబ్ధికి సంబంధించి ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 100శాతం అమలు చేస్తూ, నిరంతర ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సంక్షేమ లబ్ధి పొందిన ప్రతిఒక్కరూ మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, మార్కెట్ కమిటీ వైస్ ప్రెసిడెంట్ పాల సుబ్రమణ్యం రెడ్డి, నియోజకవర్గ సేవాదళ్ కన్వీనర్ శివా యాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆసరా కోసం జగనన్నే కావాలి

నారాయణవనం: సంక్షేమ పాలనతో ప్రతి పేద కుటుంబానికి ఆసరాగా నిలవాలంటే మళ్లీ జగనన్నే రాష్ట్రానికి సీఎం కావాల్సిన అవసరం ఉందని జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నారాయణవనం-3 సచివాలయం వద్ద ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ వర్గ, కుల, పార్టీ భేదాలు లేకుండా అర్హతే ప్రమాణంగా పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. సచివాలయ పరిధిలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధి వివరాల డిజిటల్ బోర్డును అధికారులతో ఆవిష్కరించారు. సమావేశం అనంతరం జాతీయ రహదారిపై బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. పార్టీ జెండాను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవిష్కరించారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, తహసీల్దార్ ప్రమీల, ఏవో గుణశేఖర్, ఈవోపీఆర్డీ వేణయ్య, ఎంపీటీసీ సభ్యులు పార్వతి, పొన్నుస్వామి, మణిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, పార్టీ నాయకులు సొరకాయలు, గురుస్వామి, బాలరెడ్డి, చిన్నదొరై, మన్‌హర్, ఢిల్లీకుమార్, మోహన్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నేడు పెద్ద పాండూరులో 'వై ఏపీ నీడ్స్ జగన్'

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరులో గురువారం జరిగే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొననున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి తెలిపారు. స్థానిక కోదండరామాలయ భజన మందిరంలో మధ్యాహ్నం 3గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

నాగలాపురం మండలంలో..

నాగలాపురం: మండలంలోని ఎస్ఎస్‌పురం సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమం ఎంపీపీ సింధూ శ్యామ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ పీకేఎం బాబు అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సంక్షేమ పథకాలకు సంబంధించిన బోర్డును ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు సుమతి, సర్పంచ్ కృష్ణశెట్టి, ఎంపీటీసీ సభ్యుడు శేఖర్, వైద్యాధికారి విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, నాయకులు ఆనంద్, కులశేఖర్ రెడ్డి, దేశన్, అలగేశన్ పాల్గొన్నారు.



ఏర్పేడు: జెండా ఆవిష్కరణలో పార్టీ నాయకులు



తొట్టంబేడు : పథకాల బోర్డు ఆవిష్కరణ



నాగలాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ సింధుశ్యామ్

ఖోఖో రాష్ట్ర పోటీల్లో ప్రతిభ



విజేతలు అమృత, అర్చనరెడ్డి





లక్ష్మీప్రసాద్ చక్రీనాథ్

ఏర్పేడు: మండలంలోని పల్లం ఉన్నత పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రెండు రోజుల కిందట బంగారుపాళెం మండలం జెడ్పీ హైస్కూల్ మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలుర విభాగంలో తమ పాఠశాల విద్యార్థులు లక్ష్మీప్రసాద్, చక్రీనాథ్, బాలికల విభాగంలో అమృత, అర్చనరెడ్డి ప్రతిభ కనబరిచి జాతీయ జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. త్వరలో ఝూర్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగ నున్న జాతీయస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పీఈటీ లోకేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా చండీయాగం



యాగం నిర్వహిస్తున్న పండితులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో (శ్రీకామాక్షి అమ్మవారి హోమం) చండీయాగం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజ, హోమ మహోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలి రోజు యాగశాలలో ఉదయం పూజ, నిత్యహోమం, చండీహోమం, లఘుపూర్ణాహుతి, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం హోమం, చండీపారాయణం, సహస్రనామార్చన, విశేష దీపారాధన చేపట్టారు. భక్తులు రూ.500 టికెట్‌తో ఒకరోజు హోమంలో పాల్గొన్నారు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.